ప్రజాశక్తి
ఆదివారం 12 జనవరి 2025 5 అనంతపురం

ఓబన్నకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సెలవులోకి వెళ్దాం..!

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ముఖ్య అధికారుల దీర్ఘకాలిక సెలవుల పరంపర కొనసాగుతోంది. కారణం ఏదైనా ఇక్కడ విధులు నిర్వహించడాన్ని అధికారులు ముళ్ల కిరీటంలా భావిస్తున్నారు. కమిషనర్, అదనపు కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఒకరి తర్వాత ఒకరు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది. కార్పొరేషన్ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నా దీనిని చక్కదిద్దే కార్యక్రమాలపై పాలకవర్గం, అధికార పార్టీ నాయకులు, జిల్లా అధికారులెవరూ దృష్టి సారించకపోవడం గమనార్హం.



- కమిషనర్, అదనపు కమిషనర్, ఏసీపీ దీర్ఘకాలిక సెలవులు
- టౌన్ ప్లానింగ్‌లో కీచులాటలు
- అనంత కార్పొరేషన్‌లో పాలన గాలికి ..!

జాయింట్ కలెక్టర్‌కు కార్పొరేషన్ బాధ్యతలు..?

జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారనే చర్చ నడుస్తోంది. అయితే దీనిపై అధికారికంగా ఎక్కడా ప్రకటన వెలువడలేదు. ఈ స్థాయి అధికారి బాధ్యత చేపడితే అయినా కార్పొరేషన్‌లో అధికారుల పాలన గాడిన పడుతుందనే అభిప్రాయం పలువురిలో వ్యక్తం అవుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో అధికారులు ఒకరితర్వాత ఒకరు బదిలీపై వెళ్తుండడంతో మినిస్ట్రీయల్ విభాగం దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటోంది. అత్యవసరమైన ఫైళ్లపై సంతకాలు చేసేవారు లేకపోవటంతో కాంట్రాక్టర్లు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లు అగ్రిమెంటు పనులు స్తంభించిపోతున్నాయి. ఇటీవల మేనేజర్ సతీష్ కుమార్ సైతం పెనుగొండ నగర పంచాయతీ ఎఫ్ఎసి కమిషనర్‌గా నియమించారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ పరిపాలన విభాగాన్ని నడిపించే సారథి కరువయ్యారు. మున్సిపల్ ఆర్‌డి సూచనలతో డిప్యూటీ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి మేనేజర్‌గా రెవెన్యూ ఆఫీసర్ లక్ష్మీదేవికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు సైతం హిందూపురం కమిషనర్‌గా బదిలీపై వెళ్తారని ఉద్యోగ వర్గాలు చర్చ నడుస్తోంది.

కార్పొరేషన్‌లో ముఖ్య అధికారులందరూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో నగరాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరైనా టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురు మహిళా అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరి ముగ్గురి మధ్యన కూడా సయోధ్య నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఉద్యోగోన్నతిపై ధర్మవరం మున్సిపాల్టీకి బదిలీపై వెళ్లిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దుర్గాంజలి పది రోజులు గడవకనే రెండు నెలల ఆన్ డ్యూటీపై కార్పొరేషన్‌కు వచ్చేశారు. ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీషా ఆరోగ్యం సరిగాలేకపోవడం కూడా విధులపై ప్రభావం చూపుతోంది. టౌన్ ప్లానింగ్ విభాగంకు సంబంధించి దుర్గాంజలి గర్భిణి కావడంతో కార్యాలయం విధులకే పరిమితం కావాలని కమిషనర్ రామలింగేశ్వర్ సూచించారు. దీనిపై ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ శిరీష డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు లేఖ రాసి టిపిఎస్ దుర్గాంజలి ఒక్కరే ఉన్నందున లాగిన్ పంపాలని కోరడం వివాదాన్ని రాజేసినట్లు తెలుస్తోంది. కాగా ఈ విభాగంలో జరిగే ప్రతి వ్యవహారాన్ని ఒకరు నియోజకవర్గం ముఖ్య నేత దృష్టికి తీసుకెళ్తు వివాదాలకు కారణం అవుతున్నారనే ప్రచారం నడుస్తోంది. ఈ విభాగంలో ఉన్న ముగ్గురిలో ఇద్దరు ఒక జట్టుగా, మరొకరు ఒంటరిగా మారినట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలో సైతం సిఎఫ్ఎంఎస్‌కు వెళ్లే ఫైళ్లపై ఇద్దరు కమిషనర్లు తమ లాగిన్‌లోనే ఉంచుకుని ఆమోదం తెలపకపోవడంతో గుట్టలుగా ఫైళ్లు పేరుకు పోతున్నాయి. గడచిన 10 నెలల కాలంగా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కనీసం కమిషన్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఎఫ్ఎసి కమిషనర్ రామలింగేశ్వర క్లియర్ చేయలేదు. పాత ఫైళ్లు ముందుకు కదలకుండా ఆగిన నేపథ్యంలో కొత్తగా అభివద్ధి పనులు చేస్తే ఇరుక్కుపోతామన్న భయంతో కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నారు. వారికి ఎలా నచ్చజెప్పి పనులు చేయించాలో తెలియక ఇంజినీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపునకు సంబంధించి టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్, మేనేజర్ వంటి కీలకమైన పోస్టులు వారి బదిలీ తర్వాత ఖాళీగా ఉన్నాయి. తాజాగా డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు సైతం బదిలీపై వెళ్తారన్న ప్రచారం నడుస్తోంది. కార్పొరేషన్‌లో ఉన్నతాధికారులు ఒక్కొక్కరుగా దీర్ఘకాలిక సెలవులు, బదిలీపై వెళ్తుండడం అనంత కార్పొరేషన్ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పరిపాలన నిర్ణయాలు తీసుకునే వారు కరువైన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే సమర్థుడైన కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, మేనేజర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం, అర్బన్ ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోరాట యోధుడు వడ్డే ఓబన్న

జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు - పలువురి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు వడ్డే ఓబన్న అని పలువురు నాయకులు, అధికారులు కొనియాడారు. వడ్డే ఓబన్న జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం నాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కడప ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న పాత్ర మరవలేనిదన్నారు. బ్రిటీష్ పాలకులు వేసే పన్నులకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆ పోరాటంలోనే ఆయన మరణించారని తెలిపారు. నేటి యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని దేశం, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడి సుభాషిని, జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీం బాషా, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, ఐఅండ్‌పిఆర్ డిఐపిఆర్ఒ గురుస్వామి శెట్టితో పాటు వడ్డెర కుల పెద్దలు పాల్గొన్నారు.

ఇల్లు వదిలి పారిపోయిన పిల్లలు

రెండు గంటల్లో ఆచూకీ కనుగొన్న పోలీసులు-తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పోలీసుల అదుపులో ఉన్న పిల్లలు

తల్లిదండ్రులు మందలించారన్న మనస్థాపంతో నలుగురు మైనర్లు ఇళ్లు వదిలి పారిపోయారు. దీనిపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్పందించి రెండు గంటల్లోపు పిల్లల ఆచూకీని కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.. మండలంలోని జాజరకల్లు గ్రామానికి చెందిన నలుగురు మైనర్లు తమ ఇళ్లల్లో తిట్టారన్న కోపంతో శనివారం ఉదయం 11 గంటల సమయంలో పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందుకున్న ఎస్పీ సిఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కర్ణాటకలోని హులిగి గ్రామంలో పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పిల్లలు ఉన్న ఘటనా స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులు, బంధువులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించారు. రెండు గంటల్లోపు పిల్లలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించిన ఎస్ఐను ఎస్పీ అభినందించారు.

అరటిచెట్ల నరికివేత కేసు...

పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు.?

ప్రజాశక్తి-పుట్లూరు

అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మండలంలోని కొండగారికుంట గ్రామంలో అరటి చెట్ల నరికివేత ఘటనలో పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొండగారికుంటలో రైతు సుదర్శన్‌నాయుడుకు చెందిన వెయ్యికిపైగా అరటి చెట్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో శనివారం డాగ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ కుమ్మనమలలోని కొందరి ఇళ్ల వద్దకు వెళ్లాయి. దీంతో వారి పోలీసులు వారి ఇళ్లకు వెళ్లి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సంక్రాంతి పండుగ సందర్భంగా అనంత బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శనివారం ఇందిరానగర్‌లోని అనంత బాలల సంఘం కార్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఎంతో సృజనాత్మకత దాగి ఉందన్నారు. ర్యాంకులు, మార్కులు వంటి వేట పెట్టే విధానంలో ఇలాంటి ఆటలు, పాటలు, పోటీలు పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పోటీలు నిర్వహించిన అనంత బాలల సంఘం నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంత బాలల సంఘం నాయకులు చంద్రిక, అశ్విని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

శింగనమల : పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అధికారులు తెలిపారు. శనివారం మండలంలోని శోదనపల్లి గ్రామంలో తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు వైద్య, మలేరియా నివారణ వైద్య సిబ్బంది పర్యటించి జ్వరా లపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై అవగాహన కల్పించారు. తర్వాత ఇళ్లల్లోని నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, అశ్వర్థనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, రమణయ్య, ఎఎన్ఎంలు పద్మావతి తిరుపాలమ్మ, భారతి, హెల్త్ ప్రొవైడర్లు కౌసర్, అప్సరభాను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడాపోటీలు

వికలాంగ సంక్షేమ శాఖ ఎడి బి.వినోద్

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ఈనెల 19వతేదీ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి బి.వినోద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న దివ్యాంగ అభ్యర్థులు తమ పేర్లను ఈనెల 9 నుంచి 17వతేదీ వరకూ నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు కోసం నాగరాజు సెల్ 93903 88169, శ్రీనివాసులు 80741 06154 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అపరిష్కృత సమస్యలపై పోరాటాలు

- అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

అంగన్‌వాడీల సదస్సులో ప్రసంగిస్తున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అపరిష్కృతంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలపై మరింత ఐక్యంగా భవిష్యత్తులో పోరాటాలు సాగించనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు అంగన్‌వాడీలు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. వీరిని గుర్తించడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో చారిత్రక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. ఆయా సందర్భాల్లో ప్రభుత్వాలు ఉద్యమాలపై ఎంతటి నిర్బంధాన్ని విధించిన ఎదిరించి పోరాడమన్నారు. ఐక్య పోరాటాల ఫలితంగా కనీస వేతనం వర్కర్‌కు రూ.11,500 హెల్పర్‌కు రూ.7వేలు, మినీ వర్కర్‌కు రూ.7వేలు సాధించుకున్నట్లు తెలిపారు. సెంటర్ల అద్దెలు, ప్రసూతి సెలవులు, వర్కర్లకు సూపర్‌వైజర్ల పోస్టుల్లో 50 శాతం ఉద్యోగోన్నతులు ఉద్యోగవిరమణ వయోపరిమితి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర వాటిని సాధించుకున్నామన్నారు. అంగన్‌వాడీల్లో ప్రయివేటు జోక్యాన్ని తిప్పికొట్టామన్నారు. ఇంకా అంగన్‌వాడీలకు అపరిష్కృతంగా అనేక సమస్యలు ఉన్నాయని వాటి కోసం నిరంతర పోరాటం సాగిస్తున్నామన్నారు. అంగన్వాడీ వర్కర్లను మూడో తరగతి, హెల్పర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు, ఇచ్చి, పింఛన్, పిఎఫ్, ఇఎస్ఎస్ సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్ వైజరుపోస్టులను భర్తీ చేయాలన్నారు. రాబోయే కాలంలో ఈ సమస్యలన్నింటిపై పోరాటం కొనసాగుతుందన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన

రాష్ట్ర వ్యాప్తంగా చాలీచాలని వేతనాలతో పెరిగిన ధరలతో సతమతమవుతున్న తరుణంలో విద్యుత్ ఛార్జీల భారాల వేయడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కాత్యాయని జ్యోతి లతా, విజయ, శ్రీదేవి, రంగమ్మ, నక్షత్ర, రేవతి, అరుణ, పాతక్క, రామాంజనమ్మ, విజయనిర్మల, తిప్పీరమ్మ పాల్గొన్నారు.

వ్యవ'సాయం' అందేనా ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటూనే ప్రకృతి వైపరీతాల్యకు నిలయం. 2024లో అతివృష్టి, అనావృష్టి రెండూ నెలకొన్నాయి. ఇలా రెండు విధాలుగానూ రైతులు నష్టపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు వైపులా నష్టాలే జరిగాయి. కరువు మండలాలకు సంబంధించి పంటనష్టం అంచనా వేయడానికి కేంద్ర కరువు బృందం ఈ వారంలో పర్యటించింది. ఆగస్టులో కరువు నెలకొంటే జనవరిలో కేంద్ర కరువు బృందం రావడం బట్టి పాలకులకు కరువు పట్ల ఏ మేరకు శ్రద్ధ ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారి పర్యటన వివరాలను కూడా ఎక్కువగా బయటకు పొక్కనీయకుండా అధికార యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. వారి పర్యటన వివరాలను కూడా మీడియాకు ముందుగా తెలియజేయకపోవడం గమనార్హం. అంతా గోప్యతోనే అదును అయిపోయాక కరువు బృందం జిల్లా పర్యటన చెప్పింది. అది కూడా నాలుగు గ్రామాల్లో పర్యటించి మమ అనిపించేసి వెళ్లిపోయింది. ఆగస్టు తరువాత పడిన వర్షాలతో ఎక్కడ చూసినా పచ్చదనం ఇప్పటికీ నెలకుని ఉంది. ఈ పరిస్థితుల్లో కరువు బృందం పంటనష్టాన్ని ఏ మేరకు అంచనా వేయగలిగిందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇక వర్షాలతోనూ ఈ ఏడాది పంటనష్టం సంభవించింది. ఈ లెక్కలను అధికారులు ప్రభుత్వానికి నివేదించి ఉంది. ఈ నష్టం అంచనాను కేంద్ర కరువు బృందం పరిశీలిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. మొత్తంగా వర్షాభావం, వర్షాలు రెండింటి వలన కూడా రైతులు ఈ ఏడాది పంటలు నష్టపోయారు. ఈ పంటనష్టంపై అధికార, విపక్ష పార్టీలు కూడా పెదవి విరుస్తున్నాయి. అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాల్సిందని కోరుతున్నారు. కాని కరువు పారా మీటర్సులో అన్ని మండలాలు పిక్స్ అవనందునే అన్ని మండలాలు కరువు మండలాల కింద రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నష్టంలోనైనా రైతుకు ఏ మేరకు సాయం అందుతుందో చూడాల్సి ఉంది.

ఈ వారంలో ప్రధాన చర్చనీయాంశం అవుతున్నది హంద్రీనీవా. దీనికి లైనింగ్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారు. అనంతపురం జిల్లా వంటి కరువు ప్రాంతంలో వర్షాలు పడటమే తక్కువ. ఇటువంటి సమయంలో లైనింగ్ చేస్తే భూగర్భ జలాలలై దీని ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. లైనింగ్ చేయకుండా కేవలం వెడల్పు మాత్రమే చేయాలని సూచిస్తున్నారు. అది చేయడం వల్ల కాలువ చుట్టుపక్కల ప్రాంతాలన్నింటిలోనూ భూగర్భ జలాలు అభివృద్ధి చెందాడానికి వీలుంటుందంటున్నారు. 2012 నుంచి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీళ్లు వస్తున్నాయి. ఈ కాలంలో చూసినప్పుడు కాలువ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు చాలా వరకు పెరిగి ఉన్నాయి. కావున వెడల్పు చేసి లైనింగ్ ఆపాలని కోరుతున్నారు. ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో 1999-2000వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 24ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడంతో ఒకరి క్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులు భయపరెడ్డి చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, జెసి నారాయణస్వామి, బాషా, సభిరాబేగం, వివేకానందరెడ్డి, నాయుడును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, ప్రభుదాస్, హర్షవర్ధన్‌రెడ్డి, తిమ్మప్ప, మస్తాన్, భారత్‌రెడ్డి, అబ్దుల్, అనిల్, మహమ్మద్, వేణు, దితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహల గురించి ప్రజలను చైతన్యం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ వైద్యాధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ భవన్‌లో కుష్టు వ్యాధి నియంత్రణ, వ్యాధిగ్రస్తులపై గుర్తింపునకు జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా నియంత్రించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలు, హాస్టళ్లు పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని తెలియజేసే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ అధికారి రామచంద్ర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥జి.నారాయణస్వామి, జిల్లాలెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డా॥అనుపమ జేమ్స్, ఐఅండ్‌పిఆర్ డిఐపిఆర్ఒ గురుస్వామి పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బెల్టు షాపులపై ఉక్కుపాదం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. ఈనేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, కాలనీల్లో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించి విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా వేసి ముందస్తు జాగ్రత్తలు నిర్వహించాలన్నారు. కర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితుల, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో పశువుల పాకలు, గడ్డివాము ప్రాంతాలు, దుకాణాలు, బడ్డీ కొట్లు, హోటళ్లు, డాబాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అక్రమ మద్యం జోలికెళితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పాత కేసుల్లో నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. బెల్టు దుకాణాలు నిర్వహించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17న రైతాంగ సమస్యలపై ధర్నా

రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు

ప్రజాశక్తి-బెలుగుప్ప

రైతాంగ సమస్యల పరిష్కారానికి జనవరి 17న విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న ధర్నాకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాలకు జమ చేయాలని, కరువుకు గురైన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని, ఉచిత పంటల బీమా కొనసాగించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, అదనపు ఛార్జీలను రద్దు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని, డెల్టా ప్రాంతాల్లో డ్రెయినేజీలకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, ఉల్లిపాయలు, టమోటాలు, పత్తి, ఎండుమిర్చి ధరలు పడిపోకుండా చర్యలు తీసుకోవాలని, పాడి రైతులకు పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని, కంపెనీ యాక్ట్ ఉన్న పాల డైయిరీలను సహకార చట్టంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న ధర్నాకు రైతు సోదరులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బిసి కార్పొరేషన్ యూనిట్లు మంజూరు

నార్పల : రాష్ట్రంలోని బిసి, ఇబిసి యువతను ప్రోత్సహించేందుకు బిసి కార్పొరేషన్ కింద ప్రభుత్వం మండలానికి 49 యూనిట్లను మంజూరు చేసినట్లు ఎంపిడిఒ గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి కేటగిరిచి చెందిన 21 నుంచి 60ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకూ ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిపిఎల్ కుటుంబ సభ్యులుగా ఉండి, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంకు అకౌంట్ పుస్తకం, మొబైల్ నెంబర్‌తో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యల్లనూరు : మండల వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరైనట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 33 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో బిసి-ఎ 12, బిసి-బి 8, బిసి-డి 4, బిసి-ఇ 4, జనర్షియ మెడిసిన్ బీసీ 1, ఇబీసీ 1, ఇబీసీ 2, కమ్మ ఒకటి చొప్పున మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ఫారాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు

ప్రజాశక్తి-నార్పల/బుక్కరాయసముద్రం

శింగనమల నియోజకవర్గంలో ఎవరైనా ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని శింగనమల సిఐ కౌలుట్లయ్య, బుక్కరాయసముద్రం సిఐ కరుణాకర్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జూద క్రీడలు కాకుండా సంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడి పందేలు, పేకాట వంటి వ్యసనాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. కోడిపందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కుగానీ, డయల్ 100కుగానీ సమాచారం తెలియజేయాలని కోరారు.

104 ఆరోగ్య సేవలు

యల్లనూరు : మండల కేంద్రంలోని సచివాలయం-2లో ప్రాథమిక ఆరోగ్య వైద్యులు లోకేష్ ఆధ్వర్యంలో శనివారం 104 ఆరోగ్య సేవలు నిర్వహించారు. ఇందులో అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు ప్రజలకు బిపి, షుగర్ వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన సర్వీసులు ప్రారంభం

అనంతపురం రూరల్ : అనంతపురం ఎపిఎస్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని, సిటిఎం లక్ష్మీ, సిఎంఇ రమేష్‌బాబు, డిపో మేనేజర్ నాగభూపాల్, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకలు పంపిణీ

ఉరవకొండ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో పారిశుధ్య, తాగునీటి కార్మికులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, ఎస్ఐ నాగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు తహాశీల్దార్‌కు ఉద్యోగోన్నతి

ఉరవకొండ : విడపనకల్లు మండలం తహసీల్దార్ ఆర్.వి సునీతాబాయికి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కర్నూలు నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఈమె విడపనకల్లు తహాశీల్దార్‌గా గతేడాది ఆగస్టు 5న బాధ్యతలు చేపట్టారు.

క్యాన్సర్‌పై అవగాహన

రాయదుర్గం : క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణపై శనివారం పట్టణంలోని కనేకల్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు యశ్వంత్‌రాజ్ క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యదర్శి సరోజ, ఆశా కార్యకర్తలు సుశీల, అంజనమ్మ, భాగ్యమ్మ, జ్యోతి, ప్రజలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఐక్యంగా పోరాడుదాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మికులను శ్రమ దోపిడీ గురిచేసి బానిసత్వాన్ని పేరేపించేలా ఉన్న లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసుకునేంత వరకూ ఐక్యంగా పోరాడుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న మెడికల్ హాల్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి అధ్యక్షతన జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. అదానీకి దేశంలోని ఓడరేవులు, ఉక్కు పరిశ్రమలు, పవర్ ప్రాజెక్టులు అప్పగించి లక్షల కోట్లు దోచిపెడుతోందన్నారు. వాటి ఫలితంగా ప్రజలపై విద్యుత్ భారాలు సర్‌ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు పేర్లతో ప్రజల నుంచి వందల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. విద్యుత్ వినియోగంపై మీటర్లను బిగించి రీఛార్జి చేసుకుని విద్యుత్ వినియోగించే దగల్‌బాజీ విధానాలను తీసుకొస్తోందన్నారు. మోదీ అదానీకి దోచిపెడుతుంటే టిడిపి కూటమి ప్రభుత్వం ఏమి తెలియనట్లు నటిస్తోందన్నారు. నాడు జగన్ ప్రభుత్వంపై గగ్గోలు పెట్టిన చంద్రబాబు, పవన్‌లు నేడు మోదీకి మోకరిల్లుతున్నారని తెలిపారు. కార్పొరేట్, ప్రయివేటీకరణ విధానాలు అమలు చేయడంలో జగన్, చంద్రబాబు, పవన్, మోదీ అందరూ ఒక్కటే అన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, తాగునీటి సరఫరా కార్మికులు, ఆశాలకు సకాలంలో వేతనాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సిమెంట్ ఫ్యాక్టరీలు, ఉక్కు పరిశ్రమలు, వందలాది ఎకరాల భూములు కట్టబెడుతున్నారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండే పరిశ్రమలను తెస్తు ఏదో అద్భుతం చేస్తామన్నట్ల మభ్యపెడుతున్నారని విమర్శించారు. విశాఖ పర్యటనలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ తీసుకొచ్చి పరిశ్రమ ఆరంభం కాకమునుపే ఆరు నెలల వేతనాలు ఇస్తారంటూ ప్రధాని గొప్పలు చెప్పారని, లక్షల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు కట్టి, ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదంటే ఎంత మోసమో అర్థమోతోందన్నారు. మోదీ ప్రభుత్వం భవిష్యత్తులో లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు వెట్టి చాకిరి, శ్రమ దోపిడీ, బానిసత్వానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నయా ఉదార వాద విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మిక వర్గాన్ని చైతన్యం పరిచి ఐక్య పోరాటాలు చేస్తే పాలక ప్రభుత్వాలు వెనుకంజ వేస్తాయని తెలిపారు. సిఐటియుగా కార్మికుల పక్షపాతిగా ముందుండి పోరాడుతుందన్నారు. అన్ని వర్గాల కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. హక్కులు సాధించుకోవడానికి పోరాటాలే మార్గం అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు మన్ని రామాంజనేయులు, జిల్లా కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మల్లికార్జున, అచ్యుత్, ఎటిఎం.నాగరాజు, ఎన్టీఆర్ శ్రీనివాసులు, మండల నాయకులు నాగేంద్ర, సురేంద్ర, ఆజాం, ఆది, లక్ష్మీనరసమ్మ, కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందాం

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ఓబన్నకు నివాళులర్పిస్తున్న ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బ్రిటీష్ వారిపై వీరోచితంగా పోరాడి అమరుడైన వడ్డే ఓబన్న పోరాటం యావత్తు తెలుగుజాతి గర్వించదగ్గదని ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా అన్నారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఓబన్న జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం ఉయ్యాలవాడ నరసింహరెడ్డితో కలిసి బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు అని కొనియాడారు. బ్రిటీష్ పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి వీర మరణం పొందిన వడే ఓబన్న జీవితం ఆదర్శనీయమని స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో సిఐలు దేవానంద్, వెంకటేష్, ఆర్ఎస్ఐ జాఫర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : బలహీనవర్గాల పోరాట స్ఫూర్తి ప్రదాత వడ్డే ఓబన్న అని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని శనివారం రాయదుర్గంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, స్వాతంత్య్ర ఉద్యమం కంటే బ్రిటీష్ తెల్లదొరలను గడగడలాడించిన పోరాటవీరుడు ఓబన్న అని కొనియాడారు. మరుగునపడ్డ అనేకమంది వీరులను సమాజానికి పరిచయం చేసి ఆయా సామాజిక వర్గాలు మరింత ముందడుగు వేయటానికి సిఎం చంద్రబాబు ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డే సంఘం నాయకులు గోవింద, శ్రీనివాసులు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక వడ్డెర కమ్యూనిటీ భవనంలో స్వాతంత్య్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని శనివారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ మొదటితరం స్వాతంత్య్ర సమరయోధుడుగా పేరుగాంచిన వడ్డే ఓబన్న రైతులపై బ్రిటీష్ వారు విధించిన పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగించారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, వడ్డే శివ, వడ్డే మనోజ్, వడ్డే ఆనంద్, కొండాపురం రవి, వడ్డెర సాధికార జిల్లా సెక్రటరీ వలిపి రామాంజనేయులు, అశోక్, వెంకటేష్, బాలు, రమణ, శ్రీరాములు, మారుతి, జయరాముడు, మల్లికార్జున, నారాయణస్వామి, లలిప్, ఎర్రిస్వామి, మధు, ఆంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు గుత్తిలో మండల వడ్డెర సంఘం, టిడిపి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి నాయకులు పూలమాల లేసి నివాళులు అర్పించారు. ముందుగా నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడు యాదవ్, గుత్తి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు ఎస్ఎం.బాషా, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, వడ్డెర్ల సంఘం నాయకులు డి.లక్ష్మీదేవి, నరసింహులు, రాజు, చిరంజీవి, హనుమంతు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో ఓబన్నకు నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

గుత్తిలో ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

యాడికి : వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద మండల వడ్డెర సంఘం నాయకులు ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమాల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.చిన్న ఆంజనేయులు, వడ్డెర సంఘం నాయకులు డేరంగుల నాగశేఖర్, మధురాజు, వల్లపు రాము, రవి, శివ, మంజుల, మనోహర్, రామకృష్ణ, మహేష్, సుధాకర్, రాంబాబు, చిన్న సుధాకర్, నాగరాజు, పాండు, ఆంజనేయులు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి

'పల్లె పండుగ'లో నాయకులు

రాయదుర్గం మండలంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

శింగనమల మండలం సోదనపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం మండల పరిధిలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైసిపి అధినేత జగన్ తన స్వార్థ రాజకీయాలతో పేదలను అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించామన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.16.41కోట్ల విలువైన 421 పనులు మంజూరు చేయగా ఇప్పటికే 80శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇఇ సుధాకర్‌నాయక్, ఎంపిడిఒ కొండన్న, మండల కన్వీనర్ హనుమంతు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని పైదొడ్డి పంచాయతీలో నిర్మించిన సీసీ రోడ్డును విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగానే పైదొడ్డి, గలగల పంచాయతీ పరిధిలో దాదాపు 16 పనులకు రూ.3,75,000 పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని రోడ్లు దాదాపు పూర్తయ్యాయన్నారు. మరిన్ని పనులను గుర్తించి సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, పిఆర్ డిఇ సుధాకర్‌నాయక్, ఎఇ రాజ్‌కుమార్, టిడిపి మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, సదాశివ, గుమ్మఘట్ట సర్పంచు విజయలక్ష్మి, మారంపల్లి సర్పంచు రాజశేఖర్, బిసి నాయకులు బిటిపి మూర్తి, దుర్గేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి తాళ్లకెర వెంకటేష్, రాజన్న, గొల్లపల్లి జగదీష్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శోదనపల్లి గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఇఒఆర్‌డి వెంకట లక్ష్మమ్మ, ఎపిఒ శ్రీదేవి, మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, చితంబరి దొర, మాజీ ఎంపిటిసి ఓబులేసు, నాయకులు అట్టే రామాంజనేయులు, ఏకిలా ఆదినారాయణ, చిన్న చౌడప్ప, శ్రీనివాసులు, శంకర, జానకొండ శ్రీనివాసులు, ఈడిగ లక్ష్మయ్య, ఏకిల లక్ష్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ బి.సురేష్, పేట బయన్న, డాల్ వీరనారాయణ, రమేష్, ఓబులేసు, గిరిబాబు, కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : విజన్ ఉన్న నాయకుడు సిఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని కసాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోపే అభివృద్ధి పనులను పూర్తి చేసి బిల్లులను కూడా చెల్లించినట్లు తెలిపారు. ఇకపోతే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌పై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దన్నారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ అమలు చేసి నూరు గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కదిరప్ప, జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, టిడిపి నాయకులు కసాపురం దేవేంద్ర, బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, ఇఒఆర్‌డి నాగేంద్ర, ఎపిఒ కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని గోళ్ల, పాతచెరువు, గరుడాపురం గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచు కవితా బజ్జన్న, రమేష్‌బాబు, మాజీ సర్పంచు రామ్మోహన్‌యాదవ్, ఎంపిటిసి ఓబయ్య, చంద్రనాయుడు, వాటర్‌షెడ్ వైస్‌ఛైర్మన్ లింగమయ్య, మోరేపల్లి చౌలం మల్లికార్జునచౌదరి, పాపంపల్లి రామాంజనేయులు, సర్పంచు, రైతు పూజారి లింగన్న, టిడిపి నాయకులు పాతలింగ, ఈరన్న, బండి లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండలంలోని చందన, పెద్దపేట, యాడికి, పిన్నేపల్లి, ఓబులాపురం, ఉప్పలపాడు, చిక్కేపల్లి గ్రామాల్లో రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లను టిడిపి సీనియర్ నాయకులు క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రమేష్, రవికుమార్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు కోడూరు నీలకంఠారెడ్డి, కోన ఉప్పలపాడు రామానుజులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కమిటీలో పలువురికి చోటు

వైసిపి జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామ పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమించడం సంతోషకరమన్నారు. ఇందుకు సహకరించిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పదవులు పొందిన నాయకులు గంగాధరప్ప, రాహుల్

బ్రహ్మసముద్రం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా గంగాధరప్ప, పదమటి కోటిపల్లి కరణం రాహుల్‌కు చోటు లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఇచ్చిన పదవులకు కట్టుబడి అహర్నిశలు పార్టీ కోసం పని చేస్తామన్నారు. తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ నాయకులు తలారి రంగయ్య, మాదినేని ఉమా మహేశ్వరనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీ తలారి సత్తి

కళ్యాణదుర్గం రూరల్ : వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా కోనాపురం గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తలారి సత్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో స్థానిక నాయకులు ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షులు రేవన్న, హరి, షేక్షావలి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సల్లా మారుతి, గూబనపల్లి నాగరాజు, మల్లాపురం మల్లి, వైసిపి వికలాంగుల విభాగం కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షుడు పాతలింగ, ఫర్టిలైజర్ కురుబ రఘు, గోళ్ల మోహన్‌రెడ్డి, సాకే తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకేశవరెడ్డి

పామిడి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా మండలానికి చెందిన పెమ్మక చెన్నకేశవరెడ్డిని నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పెద్ద అవకాశం కల్పించినందుకు అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి, మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనవంతు బాధ్యతగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీగా జగదీష్

ఉరవకొండ : వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీగా చాబాల గ్రామ సర్పంచి మల్లెలు జగదీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డితోపాటు జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న లోకల్‌బాడీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్

శింగనమల : వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పక్కబాయి నూర్ మహమ్మద్ శనివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూర్ మహమ్మద్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని చందన గ్రామంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే రోగాలు దరిచేరవన్నారు. అదేవిధంగా స్థానిక రికార్డులను పరిశీలించారు. తర్వాత రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేసి రక్త పరీక్షల వివరాలను టెక్నీషియన్ సాయిలతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబ్బీర్, అహమ్మద్, ఎఎన్ఎం రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

యాడికి : ఎస్పీ ఆదేశాల మేరకు సిఐ ఈరన్న ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలను అవగాహన కల్పిస్తూ పోలీస్ శాఖ రూపొందించిన క్యాలెండర్లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, ఆసుపత్రి, బ్యాంకులు, తదితర ప్రదేశాల్లో పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు.

నేడు సంఘమిత్ర సమావేశం

అనంతపురం : సామాజిక క్షేత్రంలో పని చేస్తున్న సంస్థలు, వ్యక్తుల మేలు కలయిక, సంఘమిత్ర సమావేశం ఆదివారం అనంతపురంలోని అనంత కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు రవికాంత్ రమణ (మీనాక్షమ్మ ఫౌండేషన్), మల్లారెడ్డి (ఎఫ్ ఎకాలజీ సెంటర్), ఎస్‌కె లెనిన్‌బాబు (సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంస్థలు, వ్యక్తులు సామాజిక సేవలో తమ ఆనందం, అనుభవాలు, అనుభూతులను పంచుకోవాలని కోరారు.

మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రికి నివాళి

గుత్తి : మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి కె. రామ్మోహన్, నాయకులు విజయలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, కృష్ణవేణి, మాబుసాబ్, దుర్గమ్మ, ఖాదీర్, శామ్యూల్, నారాయణ శెట్టి, నాగేశం, గోవిందు, హాసన్ అహ్మద్, మద్దిలేటి, పాల్గొన్నారు.

మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

నేరాలు ఘోరాలు

మిలిటరీ మద్యం స్వాధీనం

మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : మిలిటరీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ, ఈసీల ఆదేశాల మేరకు శనివారం డిఫెన్స్ మద్యం అమ్మకాలపై స్థానిక అరుణోదయ కాలనీలో దాడులు నిర్వహించారు. కాలనీకి చెందిన షేక్ జమాల్ బాషాను అరెస్టు చేసి 20 ఫుల్ బాటిళ్ల డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా అమ్ముకునేందుకు వీటిని తెప్పించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.45వేలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహా, జాకీర్‌హుస్సేన్, కృష్ణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్, కానిస్టేబుల్ నరసింహనాయక్, ఎర్రిస్వామి, హరినాథ్‌రెడ్డి, సావిత్రి, కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని ఎన్‌టిపిసి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉబిచెర్ల గ్రామానికి చెందిన చిన్నికష్ణ పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.